# వందేమాతరం

కాలేజి జీవితాన్ని కలల అలల్లో గడిపేసిన నీరజ్‌కు బి.యస్సీ డిగ్రీ చేతికి రాగానే కోర వయసు కోర్కెలు తొంగి చూసినై. కాలేజి కారిడాల్లో దోరవయసు అమ్మాయిలు-అబ్బాయిలు కొంటె చూపులు విసురుకుంటూంటే ముసిముసి నవ్వులు ముసురుకునేవి. తుమ్మ కొమ్మల్లాంటి అంగసౌష్టవం ఏ అమ్మాయినీ అతని జోలికి రానివ్వలేదు. ఎదురొచ్చిన అమ్మాయిలు బెదురు చూపుల్తో పక్కకు తప్పుకునేవారు. అందచందాల్లో అష్టావక్రుడైనా తెలివితేటల్లో పరాక్రముడు. అపారమైన జనరల్ నాలెడ్జి మిల్టి ఆఫీసర్‌గా ఎంపిక చేయించింది.

కఠినమైన సైనిక శిక్షణ, కసరత్తుల పుణ్యమాని బీరకాయలాగున్న ఒళ్లు సొరకాయలా నునుపుదేలింది. నల్లరేగడి లాగున్న మొహం ఆపిల్ పండులా నిగనిగలాడింది. ఆత్మవిశ్వాసం బలం పుంజుకుంది. దాంతో పాటు వయసొచ్చిన మనసు సన్నాయి నొక్కులు నొక్కింది. భవిష్యత్తు బరువు బాధ్యతల గురించి ఆలోచిస్తూంటే పోస్టింగార్డరొచ్చి ప్రణయరాగాన్ని గుర్తుచేసింది.

సైనికాధిగారిగా డెహ్రాడూన్‌లో జాయినయే ముందు అమ్మ పుట్టి పెరిగిన పల్లెటూరు పుల్లూరు, మావయ్య, అమ్మమ్మలు కళ్లలో కదలాడారు. తాను పుల్లూరు వైపు కదిలాడు. బాల్యాన్ని గుండెల మీదాడించుకున్న పుల్లూరు బండ చూడాలన్పించింది. అలనాడు అరణ్యవాసములో శ్రీరామ చంద్రునికాశ్రయమిచ్చి మర్యాదా పురుషోత్తముని పాదముద్రలను ఆనవాళ్లుగా మిగుల్చుకున్న పుల్లూరు బండ వందల ఎకరాల్లో విస్తరించిన కొండ ప్రాంతము.

వసంతము రాబోతుంది. రెక్కలు కట్టుకుని పుల్లూరులో వాలిపోయాడు. తనకంటే రెండేళ్ల ముందు పుట్టిన మేనమామ, అమ్మమ్మలతో మాట్లాడాడు. అవే రెక్కల్ని సవరించుకుని పుల్లూరు బండమీద వాలి శ్రీరామచంద్రుని పాదముద్రలకు నమస్కరించాడు. బండ దిగి వస్తూంటే మానసవీణ జతులు సవరించింది. మావితోటలో నడుస్తూంటే "బలే మంచిరోజు, పసందైన రోజు..." సినిమా పాట పెదాల మీద గొణుదుగా నర్తించింది. ఎదురొచ్చిన తియ్యని స్వరం "తూనీగ తూనిగా" మలయయమారుతమై అలరించింది. అదో ఆడగొంతు.

తనపాట ఆగింది. కళ్లముందో యువతి సాక్షాత్కరించింది. లేడిపిల్లలా గంతులేస్తూ వచ్చిందేమో... ఠకీన ఆగిపోయింది. ఆశ్చర్యం... అమోఘం..దేవకన్యలాగుంది. వోణి, పరికిణి, చెవుల రింగులు, బుగ్గల నిండా సిగ్గుల ఛాయలు... కనురెప్పలు టపటపలాడిస్తూ కింది నుంచి మీద్దాక పరిశీలించింది.

"మీరెవరూ?" వోణి సవరించుకుంది.

"నాపేరు నీరజ్. ఈ ఊళ్లో బంధువులున్నారు. మీరెవరూ?" తానూ బొమ్మలాగై పోయాడు.

"నే...ను...నేను... పరిమళ... ఈ ఊరే!" మొహమ్మీదాడుకుంటున్న ముంగురుల్ని మునివేళ్లతో సవరించుకుంది. చూపుల్లోని సోయగం కన్నుల పండువుగా ఉంది.

చూపులు కలిసిన శుభవేళ... ఇద్దరూ నవ్వుకున్నారు. పూర్తి పరిచయాలైపోయినై. మనసులు గుసగుసలాడుకున్నాయి. మర్నాడు, మరో రోజూ...వరుసగా వారం రోజులక్కడే కలుసుకుని మరో లోకంలో విహరించారు.

డెహ్రాడూన్‌లో చల్లదనం, వెచ్చని జ్ఞాపకాలు... నెలలు సంవత్సరాలుగా గడుస్తున్నాయి. మేనమామ పెళ్లి పత్రిక అందింది. కొద్ది రోజుల సెలవు మంజూరైంది. స్వేచ్ఛా విహంగములా ఎగిరి, ఊహల పల్లకిలో ఊరేగితూ పుల్లూరులో వాలాడు. పరిమళ ఇంటిముందు నుండి వెళ్తూ ఆమెను చూపులతో పలుకరించాడు. పరిమళ ఊహలగ్గూడా రెక్కలొచ్చినై. మళ్లీ మావితోటలో కలయిక... తోట బృందావనమైంది. మర్నాడు స్నేహితురాలు మనస్వినితో వచ్చింది.

పానకంలో పోపుగింజలా... ఈవిడెవరో! అనుకున్నాడు. పరిచయమై కాస్సేపు కలుపు గోలుగా మాట్లాడింతర్వాత అసాధ్యురాలే అన్పించింది. జోకులు, ప్రపంచ వార్తలు చెప్పుకుంటూ హాయిగా నవ్వుకున్నారు. చివరి రోజు ఇద్దరే. మనసులు విచ్చుకున్నాయి. నీరజ్‌లో ఉత్సాహం ఉరకలేసింది. గాలితో కబుర్లాడుకుంటున్న మావి రెమ్మల్ని చూస్తూ ....

"ఆర్నెల్ల తర్వాత ఆన్యువల్ లీవు మీదొస్తాను పరిమళా! అప్పుడే మన పెళ్లి" కమ్మగా చెప్పాడు. పరిమళ నవనాడుల్లో తియ్యని సంచలనం గిలిగింతలు పెట్టింది. స్వేచ్ఛగా మాట్లాడింది.

గుండెగూటిలో తిష్టవేసుకున్న నీరజ్‌ను తలచుకుంటూ రోజులు గడుపుతుంది. పరిమళ అంతరాళాల్లో సమరం... కాని ఇరువయ్యేళ్లు పెంచిన అమ్మానాన్నల కంటే కొద్ది నెలల క్రితం కనబడిన నీరజ్ ఆత్మీయుడైనాడు. అతడు లేకుండా గడపడమంటే ఎండాకాలంలో ఎడారి ప్రయాణంలాగుంది.

ఆన్యువల్ లీవు మీదొచ్చిన నీరజ్... మర్నాడే

"అమ్మా! నేను పుల్లూరు కెళ్తానే" చిన్నపిల్లవాడిలా అడుగుతూంటే తల్లి వర్ధనమ్మకు నవ్వొచ్చింది. కొడుకు కొత్తగా కన్పించాడు.

వీడు మిల్ట్రీ ఆఫీసరా లేక మట్టితో ఆడుకునే పసిపిల్లవాడా! ఎగాదిగా చూస్తుంటే కనుబొమ్మలు ఎగిరిపడ్డాయి.

"నీ ముక్కుకు ముకుదాడు వేసేందుకు అక్కడ మా తమ్మునికో వయసొచ్చిన కూతురు లేదాయె. ఎందుకంత తొందరా?" అంటూ చాయ గ్లాసందించింది.

వేడి చాయ నరాల్లో జరజరా పాకుతూంటే కళ్ల ముందు పరిమళ పరిమళించింది. "మావయ్యకు కూతురు వరసయ్యే వారుండొచ్చు గదమ్మా" అని నాలిక్కరుచుకున్నాడు.

"ఆ అమ్మాయెవర్రా?" సాలోచనగా తల గోక్కుంది. ఏదో ఊహించుకుని ఉల్లాసంగా నవ్వుకుంది. "అయితే కొద్ది రోజుల్లో నాకో కోడలొస్తుందన్నమాటా."

"నాకేదన్నా మెసేజ్ వస్తే పుల్లూరుకు పాస్ చెయ్యాలమ్మా!" గారాబంగా చెబుతూ బయలుదేరాడు. ఉద్యోగము రికార్డుల్లో తన సొంతూరు పుల్లూరనే రాయించాడు.

పచ్చని మావితోటలో వెచ్చని మనసుల గుసగుసలు, మురిపాల ముచ్చట్లు పంచుకున్నారు. అరచేతులు నేలకానించి, కాళ్లు బార్లా సాచి ఆకాశాన్ని చూస్తున్న అతని ఒడిలో ఒడిగి పోయింది పరిమళ. సిగ్గుల బుగ్గల మీద ముంగురుల్ని సవరించుకుంటూ "ఇట్లా ఇంకెన్ని రోజులటా?" కళ్లను కమ్మగా తిప్పింది. "ఆలస్యం అమృతం విషం గదా!" అంది. అరచేత్తో ఆమె పెదాల కద్దుపెట్టి "నేనది భరించలేను పరిమళా!" అన్నాడు. అంతేకాదు.

"రేపు నీ ఫ్రెండ్ మనస్వినితో...రా! ఇక్కడే మాట్లాడుకుందాం!" చెప్పేశాడు.

"మనస్వినా? అదెందుకూ?" దూరం జరిగింది.

"నాకామె బాగా నచ్చింది."

చురచుర చూసింది. మొహం నిండా అసహ్యం అలుముకొంది. అతడు బుర్ర గోక్కున్నాడు. "అయ్యో రామా! అందుకే అన్నారేమో అసూయ ముందు పుట్టి ఆ తర్వాత ఆడది పుట్టిందని" దగ్గరికి జరిగి బుగ్గ గిల్లాడు. "మంచి స్నేహితురాలిగా ఆమె నాకు బాగా నచ్చింది" మరో చెంపమీద చిటికేశాడు.

ఊపిరి పీల్చుకుని గుండెల నిండా నవ్వింది.

"పిచ్చి పరిమళా! ముగ్గురం కలిసి మీ ఇంటికెళ్దాం. మన పెళ్లికి ఆవిడే గదా మధ్యవర్తి"

xxxxx

మర్నాడు. మావిరెమ్మల దాగుడు మూతలు పరిమళ మనసు నుయ్యాల లూగిస్తున్నాయి. మనస్వినికి మహదానందంగా ఉంది. వాళ్లిద్దరి ముందు నీరజ్ గంభీర వదనముతో కూచున్నాడు. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మనస్విని గొంతు సవరించుకొంది.

నీరజ్‌గారూ! వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. మనం మూగ దయ్యాల్లా కూచుంటే ఎట్లా?" సూటిగా అడుగుతూంటే ముక్కుపుడక చమక్కుమంది.

"అవునవును. చెప్పండి" గొంతులో గాంభీర్యం.

"పరిమళ అమ్మానాన్నలతో నిన్ననే మాట్లాడాను. మీ పెళ్లికి పచ్చజెండా ఊపేశారు. కాబోయే అల్లుణ్ని కళ్లారా చూడాలనుకుంటున్నారు."

నిర్మలంగా ఉన్న నీరజ్ మొహాన్ని సందిగ్ధం అలుముకుంది.

"నేవరినో, ఎలాంటి వాణ్నో పూర్తిగా తెలుసుకోకుండానే ఒప్పుకున్నారా? ఈ రోజుల్లో యువకులు యువతుల్ని పెళ్లి పేర మోసగిస్తున్నారు గదా!" ఎరుపు చిరునవ్వు.

"మీరు దేశాన్ని ప్రేమించే సైనికాధికారి. మోసం చేయలేరు."

"అయినా.. నన్ను చూడకుండానే!"

"తమర్ని కట్టుకోబోయేది పరిమళ. పరిమళ మనసు పడింది. కట్నం లేదు గదా! వాళ్ల ఆశయం అక్షరాల నెరవేరుతుంది."

"నిజమే కట్నమంటే పెళ్లి కాదది. వ్యాపారమవుతుంది" చిరునవ్వులో నిజాయితి మెరిసింది.

"మరి... మీ పెళ్లి...?"

"మా పెళ్లి అవుతుంది కానీ... ఆలస్యంగా!" నీరజ్ చేతుల్లో ఓ ఎండుపుల్ల రెండు ముక్కలైంది.

"ఆలస్యమా? ఇంకెదుకూ?" పరిమళ భ్రుకుటి పీటముడేసుకుంది.

"అవును పరిమళా!" నీరజ్ మొహం గంభీరమైంది. "మా హెడ్‌క్వార్టర్స్ నుంచి మెసేజ్ వచ్చింది. హిమాలయాల్లోంచి శత్రు సైనికులు దొంగతనంగా సరిహద్దుల్లోంచి చొచ్చుకొచ్చి హంగామా చేస్తున్నారట. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. యుద్ధం తప్పనిసరి. నేను వెంటనే డ్యూటీలో జాయినవాలి." మాటల్లో పొందిక, మనసు ఆరాటాన్ని ఉదాత్తంగా ప్రకటిస్తోంది. "ప్రత్యక్షంగా యుద్ధములో పాల్గొనే అవకాశం మొదటిసారి వస్తుంది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను."

స్నేహితురాళ్లు మొహాలు చూసుకున్నారు. చూపులతో అభినందించారు. పరిమళ గుండె పొంగుల్ని

అదిమి పెట్టుకుంది. "కంగ్రాట్స్ ఇదో సువర్ణావకాశం. దేహం కంటే దేశం మిన్న గదా!" ఇంకేమనాలో తోచలేదు.

పరిమళ, నీరజ్ మొహాలు చూసుకుని మౌనం పాటించారు. నీరజ్ లేచి నుంచున్నాడు.

"ఉత్తరాలు రాస్తుంటారు గదూ!" మనస్విని పరిమళ వేలుబట్టి లేచి నుంచుంది. పరిమళ గూడా భారంగా లేచింది.

"తప్పకుండా!" కర్తవ్యోన్ముఖుడై ముందుకు కదిలాడు. చెట్టాపట్టాలేసుకుని మరో దిశగా వెల్తున్న స్నేహితురాళ్లు వెనుదిరిగి చూశారు. అతడు ధైర్యంగా, వెనక్కు తిరిగి చూడకుండా హుషారుగా వెల్తున్నాడు. ఇద్దరి కళ్లు మసకబారినై.

xxxxx

మంచుకొండల్లో చిచ్చు రగిలింది. సరిహద్దుల్లో యుద్ధజ్వాలలు భారత సైనికులనుత్సాహపరుస్తున్నాయి. బాంబుల మోత, యుద్ధ విమానాల రొద, పాటాన్ టాంకుల పటాటోపం క్రీడాసక్తిని రేకెత్తిస్తున్నాయి. దొంగచాటుగా సరిహద్దుల్ని దాటివచ్చిన విదేశీ సైనుకుల హాహాకారాలు, యుద్ధ బూమిలో శత్రుమూకల్ని చిత్తుచేస్తున్న భారత జవానుల గుండె నిబ్బరాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఎముకలు కొరికే చలి పులి దేశభక్త సైనికుల ముందు పిల్లిలా మారిపోతోంది.

టీ.వి. వార్తలు ఆసక్తిగా చూస్తున్న పరిమళ అంతరాళాల్లో ఓ వైపు సంతోష తరంగాలు, ఎగిసిపడుతోంటే మరో వైపు మూగ బాధ అల్లకల్లోలం రేపుతోంది.

భగవంతుడా! నా నీరజ్ విదేశీ మూకల ఎత్తుల్ని చిత్తు చేసి అజేయంగా తిరిగి రావాలి! పై వాడికి ప్రతిక్షణం మనసులో మొక్కుకుంటోంది. నీరజ్ ఉత్తరాలు అందుకొని గుండెలకు హత్తుకుంటోంది. వెంటనే జవాబు రాసి పడేస్తోంది.

కాని ఈ మధ్య ఉత్తరాల రాక తక్కువైంది. పరిమళ, మనోసాగరములో సుడి గుండాలు జీవం పోసుకుంటున్నాయి. పది రోజుల తర్వాత వచ్చిందో ఉత్తరం. కళ్లకద్దుకుని ఆబగా విప్పి చదివింది. మూడే ముక్కలు "యుద్ధం త్వరగా ముగిసేట్టు లేదు శత్రుదేశం రాడార్లతో కొత్త ఎత్తులు వేస్తుంది. అన్నింటినీ చిత్తు చేయాలని సంకల్పంతో ముందు కెల్తున్నాము" దాని సారాంశం. మనసు ఘోషించింది. తిండి సయించడము లేదు. నీరజ్ కోసం పలవరింతలు... అదో ప్రాయోపవేశము. ఎవరెన్ని చెప్పినా మనసు నిలవడం లేదు. శరీరం శుష్కించి పోతోంది. తల్లిదండ్రులకకు తుఫానులో చిక్కుకున్నట్టుంది.

"మానసిక వ్యాధికి మందుల్లేవు" డాక్టర్లు తేల్చిపారేశారు. మనస్విని తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆ రోజే నీరజ్ నుండి వచ్చిన ఉత్తరాన్ని చూపించి కూచోబెట్టింది. "పాలు తాగింతర్వాతే ఇస్తా"నన్నది గ్లాసెడు పాలు గడగడా తాగేసింది. ఉత్తరం పరిమళ చేతిలో కొచ్చి విప్పుకుంది. అక్షరాల వెంట చూపులు రాకెట్ స్పీడందుకున్నాయి.

"యుద్ధం ఎప్పుడాగి పోతుందో దెలియదు. మా బటాలియన్ ముందుకు దూసుకు పోతోంది" సారాంశం. కళ్లల్లో కాంతి రేఖలు విచ్చుకున్నై. ప్రతి అక్షరములో నీరజ్ రూపం సాక్షాత్కరించింది. ఉత్తరాన్ని ముద్దుబెట్టుకుంది.

"కాయితం, కలం అందుకో మనూ! నీరజ్‌కు ఉత్తరం... నేనే చెప్తుంటాను. నువు రాయి" అంటూంటే గాజు కళ్లల్లో జీవకాంతి తొణికిసలాడింది...... "నా నీరజ్ శత్రుసేనల్ని చీల్చి చెండాడ్తూనే ఉండాలి. భగవంతుడా! నీరజ్ భారమంతా నీదే!" మనసులో నమస్కరించుకుంది. ఉత్సాహాన్ని కూడదీసుకుని ఉత్తరం రాయించింది. రాసిన ఉత్తరాన్ని కళ్లకద్దుకుంది.

xxxxx

"తనువు శాశ్వతము గాదు
ధనము వెంట రాబోదు.
సాంసారిక సుఖమేది, సారము నందించలేదు.
సర్వస్వం మాతృభూమి, సేవలకే వెచ్చిస్తా
ప్రాణాలున్నంత వరకు, పరాక్రమాన్ని చూపిస్తా"

పరిమళ నుండి వచ్చిన ఉత్తరాన్ని చదవగానే నీరజ్‌లో నూతనోత్సాహం ఉరకలేసింది. ఆత్మ విశ్వాసం ఐదారు రెట్లు పెరిగింది.

"ఒకరిద్దరి సుఖం కన్నా దేశ రక్షణ మిన్న. మాతృభూమి రక్షణ యజ్ఞములో సమిధగా మారడమో వరము" ఉత్తరం ముగింపును మరోసారి చదువుకుని తృప్తిగా నిట్టూర్చాడు. యుద్ధరంగం క్రీడారంగములా గన్పించింది.

భారత సైనికాధికారులు శత్రుసేనల ఎత్తులకు పై ఎత్తులు రచిస్తున్నారు. దుర్భేధ్యమైన శత్రుదేశంలోకి ఆకాశయానముతో చొచ్చుకెళ్లి అక్కడి ఆయుధగారాల మీద బాంబులేసి ధ్వంసం చెయ్యాలనే వ్యూహం కరారైంది. అందుకోసం ఆత్మాహుతి దళం తయారైంది. విమానం నడిపేదొక రైతే, ఆయుధగారాల మీద గురితప్పకుండా బాంబుల వర్షం కురిపించే బాధ్యతను నీరజ్ స్వీకరించాడు.

ప్రాణాలను ఫణంగా పెట్టిన పథకం విజయవంతముగా అమలైంది. శత్రుదేశం ఆయుధగారాలు ధ్వంసమై పోయినై. ఆ దేశం యుద్ధ విమానాలు నీరజ్ విమానాన్ని వెంబడించాయి. వెన్నంటి వేటాడాయి.

భారతదేశం విజయం సాధించింది. దేశప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసినై.

xxxxx

పుల్లూరు జనాలు అనందోత్సాహములో మునిగారు. నీరజ్ తల్లిదండ్రులు గూడా పుల్లూరు చేరుకున్నారు.ఓ వైపు అతణ్ని కళ్లారా చూడాలనే ఆరాటం అయోమయంలో ముంచెత్తింది. పరిమళ అతనికోసమే కళ్లల్లో వత్తులేసుకుని ఎదిరి చూస్తోంది.

సూర్యోదయం లేతకిరణాలను వెదజల్లుతోంది. పుల్లూరులో సైనిక విభాగపు హెలికాప్టర్ దిగుతోంది. అనందోద్వేగాల నదుపుచేసుకుంటూ ఊరి జనాలతో పాటు పరిమళ, మనస్విని చేరుకున్నారక్కడికి. హెలికాప్టర్ లోంచి ఇద్దరు జవానులు దిగారు. పరిమళ అంతరాళాల్లో పరితాపం. హెలీకాప్టర్‌లోంచి స్ట్రెచర్ మీద నీరజ్‌ను బయటకు తెచ్చారు. పరిమళ తెగించి ముందుకెళ్లింది.

"పరిమళా!" నీరజ్ పిలుపులో కమ్మని వీణానాదముంది.

"నీరజ్!" పరిమళ మొహం వెయ్యి దళాల బంతి పూవులా విచ్చుకుంది. నీరజ్ కళ్లు వెలుతురు పూలైనాయి. కాని మొహంలో రంగులు మారుతున్నాయి.

"పరిమళా!" నువ్వు రాయించిన ఉత్తరం నాకు ఎంతో బలాన్నిచ్చింది. ప్రాణాలకు తెగించాను. శత్రుదేశం నుండి తిరిగొస్తుంటే నా విమానం కూలిపోయింది. కుడికాలు విరిగిపోయింది. మొండి ఘటాన్ని ఒంటికాలుతో తిరిగొచ్చాను..." కళ్లల్లో నీటి ముత్యాలు మెరుస్తున్నాయి.

"ఐతేయేం!" పరిమళ అతని చేతులందుకుంది. "నువ్విప్పుడు నా పాలిటి సకల గుణాభి రాముడివి!" అతని అరచేతుల్ని చెంపల కద్దుకుంది.

"వీరజవానుకు .జై భారత్ మాతాకీ జై" జనాల నినాదాలతో పుల్లూరు మార్మోగింది.

--- ÷ ---

(చేతన, జనవరి-2009)

